# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**
2. **భారీ వర్ష సూచనల నేపథ్యంలో వరదల పట్ల ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో నీటి సంరక్షణకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్- టీజీపీఎస్సీ విడుదల చేసింది.**
5. **ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==============================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు తీవ్ర అల్పపీడనంగా బలపడనుందని, అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. 'దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అనంతపురం జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై మా ఆకాశవాణి అనంతపురం జిల్లా ప్రతినిధి ఎం. మనోహర్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు భారీ వర్ష సూచన నేపథ్యంలో ఆకస్మికంగా వచ్చే వరదల పట్ల ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, నీటిపారుదల శాఖపై మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి ముఖ్యమంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వాతావరణ సూచనల మేరకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశామని చెప్పారు. నెల్లూరు, ప్రకాశం, సత్య

సాయి, అనంతపురం, చిత్తూరు సహా వివిధ జిల్లాల్లో వాగులు, కాలువల హరివాహక ప్రాంతాల్లో వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. తుఫాన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్రంలోని మునిసిపల్ కమిషనర్లు.. ఇంజనీర్లు.. ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నారాయణ దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..

...వాయిస్ ...30 సెకన్లు

---------------------------

మరోవైపు తెలంగాణలో ఈ రోజు నుంచి రానున్న రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో నీటి సంరక్షణకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయంలో పోలవరంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే నెల నుంచి ప్రాధాన్యక్రమంలో అన్ని ప్రాజెక్టులకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభించి 2025 నవంబరు నాటికి పూర్తి చేయాలని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 24 సెకన్లు)

---------------------------

తెలంగాణలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి.. ఆ సంస్థ ప్రతినిధులతో నిన్న సమావేశమై సంస్థ పురోగతిపై ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యాంగ్ లియూతో దృశ్యమాధ్యమం ద్వారా సంభాషించారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్-టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ మేరకు హాల్‌టికెట్లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

కాగా ఈ నెల 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 31 వేల 382 మంది అభ్యర్థులు గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. మరోవైపు వైపు గ్రూప్ –1 ప్రిలిమ్స్ జవాబుల తుదికీ కి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఈరోజు తీర్పును వెలువరించనుంది.

---------------------------

ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోని కారణంగానే అతిసార, శ్వాసకోశ వంటి వ్యాధులతో ప్రపంచ వ్యాప్తంగా వేలాదిమంది అనారోగ్యం బారినపడుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో చేతుల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో 2008 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈదినోత్సవాన్ని నిర్వహిస్తోంది. కాగా ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో తొలి ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన యూఎస్–ఇండో వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నిర్వహించిన సదస్సులో నిన్న మంత్రి మాట్లాడుతూ, ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా అత్యుత్తమ మానవ వనరులను అభివృద్ధిచేసి రాష్ట్రాన్ని విజ్ఞాన, ఆర్థిక కేంద్రంగా మార్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. "గవర్నమెంట్ ఆన్ యువర్ ఫోన్" విధానం ద్వారా తొలి దశ కింద 100 ప్రభుత్వ సేవలను ఫోన్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని వరంగల్ లో పర్యటించిన ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, దేశంలో ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి, భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లో దివ్యాంగుల జాబ్ పోర్టల్‌ను ఆమె నిన్న ఆవిష్కరించి మహిళా సంక్షేమ శాఖలో 10 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులు జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే అర్హత ప్రకారం ఉద్యోగాలు వస్తాయన్నారు. సంక్షేమ నిధుల్లో వారికి ఐదు శాతం కేటాయిస్తున్నామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షాలు నేపథ్యంలో తిరుమలలో భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల తయారీ కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలో విపత్తు నిర్వహణ ప్రణాళికపై

టిటిడి అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామల రావు మాట్లాడుతూ, ఈరోజు సిఫార్సు లేఖలు , రేపు విఐపి బ్రేక్ దర్శనాలు అనుమతించకూడదని తెలిపారు.

---------------------------

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో ఈరోజు ప్రధానఘట్టమైన సిరిమానోత్సవం జరగనుంది. మరోవైపు నిన్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కంట్రోల్ రూమ్‌ను మంత్రి పరిశీలించి సిరిమానోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

========================